క్లుప్తంగా

శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు



డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్

తెనాలిఅర్బన్:మహాశివ రాత్రిని పురస్కరించుకుని శనివారం నుంచి శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో తెనాలి మేనేజర్ ఎ.రాజశేఖర్ తెలిపారు. ప్రతి రోజు రాత్రి 9 గంటలకు అల్ట్రా డీలక్స్ బస్సు తెనాలి నుంచి శ్రీశైలం వెళ్తుందని చెప్పారు. భక్తులంతా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

పన్నులు చెల్లించి రాయితీ పొందండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘ పరిధిలోని ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులను ఈ నెల 31 లోపు చెల్లించే వారికి ప్రభుత్వం వడ్డీ రాయితీ ప్రకటించిందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. గతం నుంచి పన్నులను చెల్లించకుండా ఉన్నవారు వెంటనే పన్నులు చెల్లించి రాయితీ పొందాలన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని పన్నుల చెల్లింపు కేంద్రంలోనూ, సచివాలయాల్లోనూ పన్నులను చెల్లించవచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని బకాయిదారులు ఉపయోగించుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ



తెనాలిఅర్బన్: వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం శనివారం తెనాలి పట్టణంలోని 40 వార్డులలో జరిగింది. వార్డు వలంటీర్లు, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. గంగానమ్మపేటకు చెందిన ఆర్.నాగవెంకట అనంతలక్ష్మికి వికలాంగ పింఛన్‌ను వలంటీర్ సునీత, లింగారావు సెంటర్‌కు చెందిన అత్తోట దాసయ్యకు వృద్ధాప్య పింఛన్‌ను వలంటీర్ సీహెచ్.ఉషాదేవి పంపిణీ చేశారు. కొత్తపేటకు చెందిన బి.దేవానంద్‌కు డయాలసిస్ పింఛన్ రూ.10 వేలను వలంటీర్ వి.శకుంతల అందజేశారు.

చావావారిపాలెంలో స్వచ్ఛ భారత్



తెనాలిఅర్బన్: జాతీయ సేవా పథకం శిబిరంలో భాగంగా చావావారిపాలెంలో జెఎంజే కళాశాల ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని పరిసరాలను శుభ్ర పరిచారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అరుణ సుజాత మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన అనారోగ్య సమస్యలను అధిగమించవచ్చని చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సుధీర్‌కుమార్, విద్యార్థినులు పాల్గొన్నారు.

బీసీ సంఘం జిల్లా మహిళా విభాగ అధ్యక్షురాలిగా దరియా



నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘ జిల్లా మహిళా విభాగ అధ్యక్షురాలిగా దాసరి దరియా నియమితులయ్యారు. విజయవాడలో శనివారం జరిగిన బీసీ సంఘాల ఆత్మీయ సమావేశంలో సంఘ జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య నుంచి నియామక పత్రం అందుకున్నట్లు దరియా తెలియజేశారు. జిల్లాలో సంఘ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తానని చెప్పారు.

అభ్యర్థుల ఎంపికలో సామాజిక న్యాయం పాటించిన బీజేపీ

రాష్ట్ర ఉపాధ్యక్షుడు యలవర్తిపాటి పాండురంగ విఠల్

గుంటూరు మెడికల్: బీజేపీ శనివారం ప్రకటించిన లోక్‌సభ అభ్యర్థుల జాబితాలో సామాజిక న్యాయం పాటించిందని ఆ పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు యలవర్తిపాటి పాండురంగ విఠల్ అన్నారు. స్థానిక బ్రాడీపేటలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో కుల, మత, వర్గాలకు సమన్యాయం ఒక బీజేపీతోనే సాధ్యమని పేర్కొన్నారు. మహిళలకు, బీసీలకు అధిక ప్రాధాన్యత సీట్లు ఇవ్వడం ద్వారా దేశంలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేసినట్లు చెప్పారు. బీసీలకు 30 శాతం సీట్లు కేటాయించడం ద్వారా వారి అభ్యున్నతికి బీజేపీ కట్టుబడి ఉందని మరోసారి రుజువైందని తెలిపారు.

సీఎం జగన్ పాలనలో సర్కారు బడులకు మహర్దశ

ఎమ్మెల్యే శివకుమార్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: మౌలిక వసతుల కల్పనకు దాతల సాయం కోసం ఎదురు చూసే ప్రభుత్వ పాఠశాలలకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మహర్దశ పట్టిందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూలులో రూ.84 లక్షల వ్యయంతో నిర్మించిన ఏడు అదనపు తరగతి గదుల నూతన భవనాన్ని శనివారం ఆయన స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తెనాలిలో నిన్న మొన్నటి వరకు మున్సిపాలిటీ పరిధిలో గల పాఠశాలలకు మౌలిక వసతుల కల్పనకు దాతల సాయం కోసం చూసే పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చాక పేద, మధ్య తరగతి వర్గాల పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్ని నాడు–నేడు పథకం ద్వారా కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దినట్టు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టడంతో పాటు సీబీఎస్ఈలో ప్రభుత్వ పాఠశాలల్ని అనుసంధానం చేసి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యా బోధన చేస్తున్నట్టు గుర్తు చేశారు. నాడు–నేడు రెండో దశ పనుల్లో భాగంగా 31వ వార్డులోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూలులో అదనపు తరగతి గదులను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక రమేష్, వార్డు కౌన్సిలరు జి.మానసారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు కప్పల రాజారెడ్డి, స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండూరి శ్రీనివాసరావు, కార్యదర్శి కె.పద్మజ, ఉపాధ్యాయులు ఎస్.హేమలత, కె.శైలజ, ఇ.అంబరీషుడు, కాంట్రాక్టర్లు చుండూరు వెంకటేశ్వరరావు, చుక్కా ఆనందబాబు పాల్గొన్నారు.

బీసీ ఉద్యమనేత నరసింహారావుకు నివాళి

తెనాలి: పట్టణంలోని వైకుంఠపురం దేవస్థానం వ్యవస్థాపకుడు తుళ్లూరు నరసింహారావు గౌడ్ 38వ వర్ధంతితో పాటు ఆయన సతీమణి తుళ్లూరు ఆది లక్ష్మమ్మ 16వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నరసింహారావు విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు.

చిన్నారుల నిండు జీవితానికి రెండు చుక్కలు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



ర్యాలీని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: అప్పుడే పుట్టిన చిన్నారి నుంచి ఐదేళ్ల వయస్సు ఉన్న వారందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పిలుపునిచ్చారు. తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుంచి శనివారం నిర్వహించిన పల్స్ పోలియో అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పోలియో మహమ్మారిని తరిమి వేయాలంటే చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని పేర్కొన్నారు. కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ ఆదివారం తెనాలి పట్టణంలోని పల్స్ పోలియో కేంద్రాల్లో చిన్నారులకు చుక్కల మందు వేయడం జరుగుతుందని చెప్పారు. రెండు చుక్కలు చిన్నారులకు రక్షణగా ఉంటాయన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఉదయం 7గంటల నుంచి పోలియో కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఎన్‌సీసీ అధికారి బెల్లకొండ వెంకట్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకంత్, సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ జి.రవికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు పాల్గొన్నారు.

ముందస్తు వైద్య పరీక్షలతో ప్రాణాలు పదిలం



మాట్లాడుతున్న డాక్టర్ డి.శారద

తెనాలి: గుండె నొప్పి లక్షణాలు కనిపించిన వెంటనే సంబంధిత వ్యక్తులు ముందస్తు పరీక్షలతో ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని, ఇందుకు ధర్మ హెల్త్ ప్రాజెక్ట్ సహాయ పడుతుందని డి3 శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ డి.శారద సూచించారు. సొసైటీ ఆధ్వర్యంలో రూరల్ మండలం పెదరావూరులో ధర్మ హెల్త్ ప్రాజెక్ట్ ప్రారంభించి రెండు నెలలైన సందర్భంగా శనివారం తెనాలిలో మీడియా సమావేశంలో మాట్లాడారు. తెనాలి సబ్‌కలెక్టర్ అనుమతితో తమ ప్రాజెక్టు ఆధ్వర్యంలో జన సంచార ప్రదేశాల్లో ధర్మ సంచార ఎన్‌సీడీఎస్ స్క్రీనింగ్ వాహనంతో వైద్యపరీక్షలు చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు 300 మందికి ఈసీజీ పరీక్షలు చేసి, అవసరమైన వారికి కార్డియాలజిస్టులతో మందులు రాయించినట్టు తెలిపారు. ఈసీజీలో తేడా ఉన్న 21 మందిని గుర్తించి, సొసైటీ ఖర్చుతో విజయవాడ తీసుకెళ్లి ఉచితంగా ఎకో పరీక్షలు చేయించామన్నారు. గుండెనొప్పి వస్తుందని అనుమానించిన వారు తమను సంప్రదిస్తే ముందస్తు పరీక్షలు చేసి, అవసరమైన వారికి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉండే ఖరీదైన ఇంజక్షన్‌ను వాడుకునే అవకాశం కల్పిస్తామని చెప్పారు. వలంటీర్ల సహకారంతో మరిన్ని ప్రాంతాలకు వైద్యసేవల విస్తరణకు ప్రణాళికను రూపొందిస్తున్నామని వివరించారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం



ఎన్నికల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి పుష్ప

తెనాలిఅర్బన్: రాష్ట్రంలో సుస్థిర పాలన కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. 3వ వార్డులో అన్నాబత్తుని పుష్ప, 23వ వార్డులో చైర్‌పర్సన్ శనివారం సాయంత్రం ఎన్నికల ప్రచారాలను నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని తెలియజేసి ఓట్లు అభ్యర్థించారు. 3వ వార్డు కౌన్సిలర్ ఆవుల కోటయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ ఆలమూరి విజయలక్ష్మి కుమారి, వైఎస్సార్ సీపీ క్లస్టర్–1 అధ్యక్షుడు మద్దాలి శేషాచలం, 23వ వార్డులో వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి, కౌన్సిలర్లు తోక శిరష, పెద్దలంక లక్ష్మీలావణ్య, వీర్లపాటి విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వల్లభాపురం(కొల్లిపర): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కు ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే శివకుమార్ చిన్న కుమారుడు అన్నా బత్తుని అఖిల్ గణేష్ కోరారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని వల్లభాపురం గ్రామంలో స్థానిక పార్టీ నాయకులతో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ కరపత్రాలు అందజేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, తన తండ్రి అన్నాబత్తుని శివకుమార్‌ను ఎమ్మెల్యే గా గెలిపించాలని కోరారు.

తెనాలిటౌన్: రూరల్ మండలం సోమసుందరపాలెం గ్రామంలో శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడు అన్నాబత్తుని సత్యనారాయణ ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు ఆయన అందజేశారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈయనతో పాటు ఎంపీపీ ధర్మరాజులు చెన్నకేశవులు, మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ జోన్ సందర్శన



పవర్ లిఫ్టింగ్ జోన్‌ను పరిశీలించిన జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

మంగళగిరి: నగరంలోని తెనాలి రోడ్డులో ప్రారంభోత్సవానికి సిద్ధమైన దివంగత గుమ్మడి పుల్లేశ్వరరావు పవర్ లిఫ్టింగ్ జోన్‌ను జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం సందర్శించారు. పవర్ లిఫ్టింగ్ జోన్‌లోని క్రీడా వేదికకు మంగళగిరికి చెందిన అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ షేక్ సాదియా అల్మస్ పేరు, క్రీడా ప్రాంగణానికి దివంగత గుమ్మడి పుల్లేశ్వరరావు పేరు పెట్టాలని నిర్ణయించడం ఎంతైనా అభినందనీయమని గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్మాకుల విజయ్‌భాస్కర్ కొనియాడారు. పవర్ లిఫ్టింగ్ జోన్ నిర్మాణం చేయడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి ఆర్కే అసోసియేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ సంధానీ, ట్రెజరర్ గుమ్మడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పి.భాస్కరరావు, బొల్లినేని చంద్రిక, జాయింట్ సెక్రటరీలు ఘట్టమనేని సాయి రేవతి, ఎస్‌డీ మస్తాన్ వలి, సభ్యులు ఆళ్ల పవన్‌కుమార్, షేక్ సుభానీ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లు, రూట్‌ను పరిశీలించాలి

తాడికొండ: ఎన్నికల విధులలో భాగంగా కేటాయించిన రూట్‌లకు సంబంధించిన సెక్టార్ ఆఫీసర్‌లు వారి పరిధిలోని పోలింగ్ బూత్‌లు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఫర్నీచర్, ర్యాంపు ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయా లేదా అని పరిశీలించుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.గంగరాజు శనివారం తెలిపారు. పలు పోలింగ్ స్టేషన్‌లను పరిశీలించారు.

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



మురుగు కాలువను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: మురుగు సమస్యల పరిష్కరానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 2వ వార్డు గోలిడొంక రోడ్డులో శనివారం ఉదయం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించారు. మురుగు కాల్వలో వ్యర్థాలు పేరుకుపోయి ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. కాల్వలను బాగు చేయాలని స్థానికులు కోరారు. దీనిపై స్పందించిన ఆమె మురుగు కాల్వలో పూడికతీత పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఆమె వెంట మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ కె హెలెన్ నిర్మల, వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, పలువురు మున్సిపల్, సచివాల ఉద్యోగులు ఉన్నారు.

బీసీలకు నరసింహారావు సేవలు చిరస్మరణీయం



నివాళి అర్పిస్తున్న భట్రాజు సంఘం నాయకులు

తెనాలి: గౌడ సంఘం స్థాపించి, బీసీ కులాలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు విశేషంగా కృషి చేసిన బీసీ ఉద్యమనేత తుళ్లూరు నరసింహారావు గౌడ్ చిరస్మరణీయులని పట్టణ భట్రాజు సంగం అధ్యక్షుడు లోలభట్టు గంగరాజు నివాళులర్పించారు. స్థానిక గంగానమ్మపేటలో శనివారం జరిగిన నరసింహారావు గౌడ్–ఆదిలక్ష్మమ్మ దంపతుల వర్ధంతి కార్యక్రమంలో భట్రాజు సంఘం ఆధ్వర్యంలో ఇరువురికీ నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ భట్రాజుల సమన్వయకర్త, సేవారత్న తంగెళ్ల శేషంరాజుతో కలిసి నరసింహారావు గౌడ్ బీసీ కులాల సమన్వయం కోసం చేసిన కృషిని, ఉద్యమాలతో ప్రభుత్వం నుంచి రాబట్టిన హక్కుల గురించి స్మరించుకున్నారు. పట్టణ భట్రాజు సంఘం ప్రధాన కార్యదర్శి కూరపాటి ఆంజనేయరాజు, కోశాధికారి కూరపాటి సీతారామరాజు, కన్వీనర్ కూరపాటి కొండంరాజు, ప్రచార కార్యదర్శి భల్లం రఘునాదీశ్వరరాజు, సరికొండ రమాదేవి, కూరపాటి సుమతి, కూరపాటి అంజనీదేవి, కూరపాటి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

తాడేపల్లిరూరల్: కార్పొరేషన్ పరిధిలోని ఇప్పటంలో ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను శనివారం తెల్లవారుజామున ఎస్ఐ రమేష్ స్వాధీనం చేసుకున్నారు. చిర్రావూరు కృష్ణానదిలో నిషేధిత ఇసుక క్వారీ నుంచి ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ముగిసిన బాబా ఆలయ వార్షికోత్సవ వేడుకలు



మందిరంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని శ్రీరామసాయి జ్ఞాన మందిరంలో జరుగుతున్న వార్షిక మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. రామసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం మందిరంలో కాకడ హారతి, బాబావారికి పంచామృత అభిషేకం జరిపారు. ఉదయం 8 గంటలకు లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. బాబావారికి ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు చేశారు. అనంతరం సుమారు ఆరు వేల మందికి అన్న సంతర్పణ చేశారు. ఆలయ అర్చకులు వి.వెంకటసాయి కృష్ణ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. రామసాయి ట్రస్ట్ చైర్మన్ సంకా సతీష్, సభ్యులు మల్లిశెట్టి శ్రీనివాస్, అకరంశెట్టి నాగేశ్వరరావు, సంకా రవికుమార్, అమరేంద్రప్రసాద్, అంకటి రమేష్, సంకా సీతారామయ్య, తాళ్లూరి ముత్తయ్య, పోకల శివరామకృష్ణ, మోర రోశిరెడ్డి, పంది వెంకటేశ్వరరావు, కాలిశెట్టి ధర్మారావు, భక్తులు పాల్గొన్నారు.


ఉత్సాహంగా సాంస్కృతిక సంబరాలు



సంబరాల్లో చిన్నారులు, అతిథులు

తెనాలి: స్థానిక చెంచుపేట అమరావతి ప్లాట్స్‌లోని వివేక హైస్కూలులో శనివారం ఆహార, సాంస్కృతిక సంబరాల (ఫుడ్ అండ్ కల్చరల్)ఫెస్ట్‌ను నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు వివిధ రాష్ట్రాల వాణిజ్య పంటలు, వంటకాలు, ప్రసిద్ధ స్థలాలు, ప్రముఖులను గురించి తెలియజేస్తూ, ఆయా రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ వేషధారణతో అతిథులను అలరించారు. వంటకాలను ప్రదర్శించారు. వివేక విద్యాసంస్థల డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కె.రామరాజు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించటం ద్వారా చిన్నారుల్లో దేశభక్తి, సామాజిక అవగాహన ఏర్పడుతుందని చెప్పారు. తద్వారా సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని అన్నారు. మరో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గుత్తా వెంకటరత్నం, సీఈవో ఆర్.ఉదయ్‌కిరణ్, కోఆర్డినేటర్ షేక్ షెహనాజ్, ప్రిన్సిపల్స్ జి.వీరయ్యచౌదరి, పి.శ్రీనివాస్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉరుసు మహోత్సవాలు



ఉరుసు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సయ్యద్ షా సులేమాన్ ఖాదిరి, మత పెద్దలు

లక్ష్మీపురం: హుజూర్ గౌసే ఆజం దస్తగిర్ (హజ్రత్ మహబూబ్ సుభాని) వారి 17వ మనువలు గుంటూరు నగరంలో వేంచేసి ఉన్న హజ్రత్ మొహీయుద్దీన్ బాద్‌షా అవులియా బాబా 314వ ఉరుసు, హజ్రత్ సయ్యద్ షా అసదుల్లా ఖాదిరి బాబా వారి 90వ ఉరుసు మహోత్సవాలు పండుగ వాతావరణంలో అత్యంత వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని దర్గా పీఠాధిపతులు మహబూబ్ సుభాని వారి 23వ మనువలు సయ్యద్ షా సులేమాన్ ఖాదిరి అల్ జిలానీ సాహెబ్ అన్నారు. స్థానిక నల్లచెరువు ఎత్తురోడ్డు సెంటర్‌లోని హజ్రత్ మొహీయుద్దీన్ పాలెంలోని దర్గా ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా పవిత్ర రంజాన్ మాసానికి ముందు వచ్చే షాబాన్ మాసం చంద్రమాన 21వ రోజు తమ తండ్రి గురువులైన సయ్యద్ షా నూరుల్ ముస్తఫా ఖాదిరి ఆశీస్సులతో బాబా ఉరుసు మహోత్సవాలు నాలుగు రోజుల పాటు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ మహోత్సవాలు ఈనెల 3వ తేదీన ఆదివారం రాత్రి 9 గంటలకు సందల్ షరీఫ్(గంధోత్సవం)తో ప్రారంభమవుతాయన్నారు. 4వ తేదీ సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు, అన్నదానం, రాత్రి 9 గంటలకు హైదరాబాద్ వారి బృందం చేత గొప్ప ఖావ్వాలి, 5వ తేదీ సాయంత్రం ఖతమ్ షరీఫ్ సందర్భంగా అన్నదానం, రాత్రి 10 గంటలకు నాత్ ఏ షరీఫ్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. మొహీయుద్దీన్ పాలెం వాసులు, నగర ప్రముఖులు, పీర్ మురీదులు పాల్గొన్నారు.

మొబైల్ వాహనంపై మద్యం అమ్మకాలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని మొబైల్ వాహనంపై తిరుగుతూ మద్యం విక్రయిస్తున్న ఓ మహిళను తాడేపల్లి పోలీసులు శనివారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలు.. గుండిమెడకు చెందిన కారుమంచి మేరిజ్యోతి తన ద్విచక్ర వాహనం స్కూటీలో 20 క్వార్టర్ మద్యం బాటిళ్లు పెట్టుకుని రేపల్లె, కనకదుర్గ వారధి కరకట్టపై చిర్రావూరు దగ్గర ద్విచక్ర వాహనంలో అటూ ఇటూ తిరుగుతూ ఆ రహదారిలో ప్రయాణించే వారికి మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో తనిఖీ చేశామని, వాహనంలో 20 క్వార్టర్ బాటిళ్లు లభించడంతో ఆమెపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచగా గౌరవ న్యాయమూర్తి ఆమెను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

స్వచ్ఛంద సేవా సంస్థల పాత్ర కీలకం

- వర్సిటీ రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి
- ముగిసిన సోషియాలజీ, సోషల్ వర్క్ జాతీయ సదస్సు



ప్రసంగిస్తున్న ఆచార్య వరప్రసాదమూర్తి

ఏఎన్‌యూ: పేదలు, నిర్లక్ష్యానికి గురైన వృద్ధులు, బాల కార్మికులు, రోగులు, అణగారిన వర్గాలకు సేవలు అందించడంలో ఎన్జీవోల పాత్ర కీలకమని రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి అన్నారు. నాగార్జున విశ్వవిద్యాలయం సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో ' నెట్‌వర్కింగ్ అండ్ ఇంటర్‌ఫేసింగ్ ఆఫ్ నాన్– గవర్నమెంటల్ ఆర్గనైజేషన్స్ ఫర్ కన్వర్జెన్స్ ఇన్ సోషల్ యాక్షన్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన వర్సిటీ రెక్టార్ ఆచార్య పి. వరప్రసాద మూర్తి మాట్లాడుతూ సమాజంలో స్వచ్ఛంద సేవా సంస్థలు తిరుగులేని శక్తిగా మారాయని తెలిపారు. శాస్త్ర, సాంకేతిక, సంప్రదాయం, సంస్కృతి వంటి కీలక అంశాలను ప్రజలకు చేరువ చేయడంలో ఎన్జీవోల ప్రతినిధులు నిరంతరాయంగా పని చేస్తున్నారని కొనియాడారు. శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ సోషల్ సైన్స్ డీన్ ఆచార్య జి.వి.రమణ మాట్లాడుతూ ఎన్జీవోలపై ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథంతో ఉండాలని సూచించారు. గోవా కి చెందిన జాగ్రఫీ అధ్యాపకులు డాక్టర్ రత్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు విద్యా పరిశోధన అంశాలపై దృష్టి సారించాలని చెప్పారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వర్సిటీ చరిత్రలో ఎన్జీవోలపై జాతీయ సదస్సు నిర్వహణ ఇదే ప్రథమం అన్నారు. అసమానతల నిర్మూలనలో సమాజాభివృద్ధికి దోహదపడే స్వచ్ఛంద సంస్థలకు ప్రభుత్వాలు ఆర్థిక సహాయం అందిస్తున్నాయని తెలిపారు. జాతీయస్థాయిలో కర్ణాటక, గోవా, పంజాబ్, తమిళనాడు, ఒడిస్సాతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 160 పైగా పరిశోధన పత్రాలు వచ్చాయని చెప్పారు. రెండు రోజులపాటు 10 టెక్నికల్ సెషన్స్‌లో విలువైన చర్చ జరిగినట్లు పేర్కొన్నారు. సదస్సులో చేపట్టిన తీర్మానాల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేస్తామని చెప్పారు. అనంతరం అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సోషల్ సైన్స్ డీన్ ఆచార్య ఎం. త్రిమూర్తిరావు సదస్సు నివేదిక సమర్పించారు. కార్యక్రమంలో ఆచార్య కె. ధనలక్ష్మి, డాక్టర్ రాజకుమార్, డాక్టర్ రాజశేఖర్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు .

ఉండవల్లిలో చైన్‌స్నాచింగ్

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి గుంటూరు చానల్ కరకట్టపై శనివారం రాత్రి చైన్ స్నాచింగ్ జరిగింది. ఉండవల్లికి చెందిన దుర్గా పద్మ కిరాణాషాపునకు వెళ్లి కరకట్ట మీదుగా ఇంటికి వెళుతుండగా, ఎదురుగా ఇద్దరు యువకులు వచ్చి ఆమె మెడలోని నాన్‌తాడు తెంచే ప్రయత్నం చేయగా, దుర్గా ప్రతిఘటించింది. ఆమె మెడలో ఉన్న బంగారం నాన్‌తాడు సగం లాక్కొని ద్విచక్రవాహనంపై గుంటూరు చానల్ బ్రిడ్జి మీదుగా ఉండవల్లి అమరావతి రోడ్డులోకి వెళ్లారు. సమాచారం తెలుసుకున్న తాడేపల్లి సీఐ మధుసూదనరావు ఘటనా స్థలానికి వెళ్లి బాధితురాలిని నుంచి వివరాలు సేకరించారు. ఉండవల్లి, పోలకంపాడు, ఉండవల్లి సెంటర్, తదితర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేశారు.